

"అదే! అన్ని డబ్బులు నేను ఎలా తేగలను?"

"సూటిగా పాయింటుకి వచ్చావ్ బ్రదర్! నేను కోరుకునేది కూడా అదే!... నీకు ఇష్టమయితే చెప్పు, ఒక బ్యాంకుతో మాకు టై అప్ ఉంది. వాళ్లు వచ్చి నీకు పర్సనల్ లోను ఇస్తారు. ఆ డబ్బు మాకు కట్టు. తరువాత నెమ్మదిగా తీర్చుకో..."

నిట్టూర్చాడు రమేష్. "సరే! కానియ్యండి. కానీ, ఆదిత్య నాకు 20% డిస్కౌంట్ ఇప్పిస్తానని చెప్పాడు."

"ఈ ఆదిత్యతో చచ్చే చావు వచ్చింది. కనిపించిన ప్రతీ..." అని మిగిలిన మాటలు మనసులోనే మింగేసి, "...అందరికీ డిస్కౌంట్ అంటే ఎక్కడ చచ్చేది? సరే ఒక నెల ఫీజు ఎనభై వేలు, ఖర్చులకి అడ్వాన్స్ కింద లక్షా కట్టండి. ఇదిగో రశీదు. బయట బ్యాంకు ఆఫీసర్ ఉంటాడు. అతను చూపించిన కాగితాల మీద సంతకం పెట్టి వెళ్లు. వాళ్లు మాకు డబ్బులు ఇస్తారు."

"మరి నా ప్రేమ సంగతి?"

"కాసేపట్లో ఆదిత్య వస్తాడు. ఆ వ్యవహారాలన్నీ అతనే చూసుకుంటాడు. బయట కూర్చో..." అని రమేష్‌ని బయటకు పంపేశాడు వ్యాఘ్రం.

((((()))))))

ఈషిక నిద్రలేచేటప్పటికి తొమ్మిదయింది. ఫ్రెష్ అయి కిందకు వచ్చింది. ఎక్కడా తాతయ్య జాడ కనపడలేదు.

"రామలింగం! తాతయ్య ఏరీ?" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ అడిగింది.

"అయ్యగారు ఏదో అర్జంటు పని ఉందని బయటకు వెళ్లారమ్మా! రెండు గంటల్లో వస్తానన్నారు. మిమ్మల్ని బ్రేక్‌ఫాస్ట్ చేసెయ్యమన్నారు."

టేబుల్ మీద పెట్టిన గిన్నెలన్నిటి మూతలూ తీసి ఏమున్నాయో చూడసాగింది.

"తాతయ్యగారికి ఇడ్లీలు, దోశెలు, గారెలూ లాంటి పాత కాలపు వంటలే ఇష్టమమ్మా! అందుకని ఎక్కువగా అవే చేస్తుంటాను. ఇవాళ మీరు కూడా ఉన్నారని వాటితో పాటు పరాఠా చేసి పనీర్ పాలక్ కూర చేశాను. రుచి చూడండి..." అని అవి వడ్డించాడు రామలింగం.



నోట్లో పెట్టుకు చూసి, "ఓక్..." అంటూ బయటకు ఊసేసింది ఈషిక. గభాలున లేచి వెళ్లి వాష్ బేసిన్లో నోరంతా కడుక్కుంది. "ఏంటిది? ఇది పాలక్ పనీరా? ఇందులో పనీర్ ఏది?" కోపంగా అడిగింది.

"పుస్తకంలో చూసి చేశానమ్మా! పనీరంటే పన్నీరనుకుని సెంటు ఒక బాటిలంటా వంపాను. బాలేదా?" అమాయకంగా అడిగాడు రామలింగం.

"నువ్వు నీకు వచ్చిన వంటలే చెయ్యి. పుస్తకంలో చూసి ప్రయోగాలు చెయ్యకు..." ఆ కూర పక్కన పెట్టేస్తూ అంది ఈషిక.

"అయ్యగారికి చెప్పకండమ్మా! నా చేత ఆ కూర మొత్తం తినిపిస్తారు..." ఆ కూర దాచేస్తూ అన్నాడు రామలింగం.

నవ్వి, "చెప్పనులే..." అంది ఈషిక. కొన్ని క్షణాల తరువాత, "అయినా అలాంటివి కూడా ఖర్చు చెయ్యటానికి వస్తుంటాడుగా ఒకడు. దాచి అతనికి పెట్టు..."

ఆ మాటకు సమాధానం చెప్పలేదు రామలింగం. "ఎవరో కొరియర్ అతను ఉదయాన్నే వచ్చి మీకోసం ఎదురు చూస్తున్నాడమ్మా..." అన్నాడు మాట మారుస్తూ.

"ఎందుకు? అతను తెచ్చిందేదో తీసుకుని పంపిచెయ్యక పోయావా?"

"మీకు తప్ప ఎవరికీ ఇవ్వడంటమ్మా..."

ఆమెలో ఉత్సుకత పెరిగింది. నిన్న ఇండియా వచ్చిన తనకి కొరియర్లో ఏమి వచ్చింది? ఎవరు పంపారు? ఆ సస్పెన్స్ ఎందుకని, "అతన్ని లోపలకు రమ్మను..." అంది.

"బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చెయ్యండమ్మా... పిలుస్తాను."

"వద్దు. ముందు పిలువ్.."

రామలింగం బయటకు వెళ్లి కొరియర్ కుర్రాడిని తీసుకు వచ్చాడు.

అతను వచ్చి తన బ్యాగ్‌లో నుండి ఒక కవర్ తీసి ఆమెకి ఇచ్చి సంతకం తీసుకున్నాడు.

"ఎవరు పంపారు?" అడిగింది ఈషిక.

"నేను చెప్పకూడదు. లోపల ఉంది. చూడండి..." అని అతను వెళ్లి పోయాడు.

ఆమె కవర్ ఓపెన్ చేసి చూసింది. "అవర్ డోర్స్ ఆర్ ఓపెన్ ఫర్ ది ఏంజిల్... ఫ్రమ్ 'అఆఇఈ'..." అని ఉంది కవర్ మీద.



ఒక్కసారిగా ఆ కవర్ ఆమెకు నిన్న ఫ్లైట్లో పరిచయమయిన ఆదిత్యని గుర్తు చేసింది. తనను చూడగానే అతని కళ్లలో కనిపించిన మెరుపు ఆమె దృష్టి దాటి పోలేదు. అదే మెరుపు మురారి కళ్లలో కనిపిస్తే తనకు కలిగే చిరాకు, అతన్ని చూసినపుడు కలగక పోవటం కూడా ఆమె గమనించింది. ఆమెకు కూడా 'అఆఇఈ'కి వెళ్లాలనే ఉంది. కానీ ఏ కారణం లేకుండా ఏమని వెళ్లాలి? అతను నిన్న పంపిన ఇన్విటేషన్ కానీ, ఇప్పుడు పంపిన కార్డు కానీ కేవలం బిజినెస్ కోసం చేస్తున్న పనులేనా? అంత కంటే మరేదో ఉందని ఆమె మనసుకు అనిపిస్తోంది. కానీ, ముందు ఈ మురారిని వదిలించుకునే మార్గం వెతక్కుండా అక్కడకు వెళ్లి మాత్రం చేసేది ఏముంది?

ఇంతలో ఆమె ఫోన్ మోగింది. చూస్తే మృదుల ఫోన్ చేస్తోంది. ఆమె ఈషిక బెస్ట్ ఫ్రెండ్.

"ఏయ్! ఎక్కడున్నావ్?" అంది ఫోన్ ఎత్తి ఈషిక.

"ఆ మాట నేనడగాలి. నిన్ననగా వచ్చావు. డిస్టర్బ్ చెయ్యటం ఎందుకులే అని ఫోన్ చెయ్యలేదు. ఇప్పటిదాకా చూసి ఇక నువ్వెంతకీ ఫోన్ చెయ్యకపోతే నేనే చేస్తున్నాను."

నిట్టూర్చింది ఈషిక. "నేనేదో హడావుడిలో ఉన్నాలే! నువ్వు అర్జంటుగా మా ఇంటికి వచ్చెయ్! కాసేపు మాట్లాడుకుందాం..." అంది.

"అది నువ్వు చెప్పాలా ఏంటి? నేను ఇప్పుడు మీ ఇంటిలోకి ఉన్నాను. అంటే జస్ట్ అడుగు పెడుతున్నాననన్న మాట..." అంది మృదుల.

ఈషిక ఆనందంగా లేచి గుమ్మందాకా ఎదురు వెళ్లింది. అప్పటికే లోపలకి వచ్చేసింది మృదుల.

"రా! బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం..." పిలిచింది ఈషిక.

"ఇప్పుడేం బ్రేక్‌ఫాస్ట్? ఏకంగా భోంచేద్దాంలే..."

ఇద్దరూ కలిసి ఈషిక బెడ్ రూములోకి వెళ్లారు.

"ఇప్పుడు చెప్పు? నీ లండన్ చదువు పూర్తయినట్లేనా?" అడిగింది మృదుల ఈషికతోపాటు బెడ్ మీద కూర్చుంటూ.

"ఆ!... అయినట్లే..."

"అంత నీరసంగా చెప్తావేంటి? నీ చదువు ఎప్పుడవుతుందా? నువ్వెప్పుడు వస్తావా అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాను."



"నాకు మాత్రం ఆ చదువు అప్పుడే ఎందుకు అయిపోయిందా అనిపిస్తోంది."

"అదేమిటి?"

"ఇంటికి వస్తే ఆ మురారి గోల మొదలవుతుంది. అతన్ని తలచుకుంటే చాలు నాకు చిరాకు మొదలవుతుంది."

"అంత ఇష్టం లేకపోతే అదే మాట చెప్పెయ్యవచ్చుగా!..."

"అదంత తేలిక కాదు. ఆ మురారంటే మా తాతయ్యకి చెడ్డ ఇష్టం. ఎలా అయినా అతన్ని నాకిచ్చి పెళ్లి చెయ్యాలన్నది ఆయన కోరిక. నేను కాదంటే తాతయ్య ఏమవుతాడో అన్నది నా బాధ."

"ఎందుకు మీ తాతయ్యకి అతనంటే అంత ఇష్టం?"

"దానికి ఒక చిన్న సైజు సీరియల్ కథ చెప్తాడు మాతాతయ్య."

"నువ్వు సింగిల్ ఎపిసోడ్లో చెప్పు."

"మా తాతయ్య, మురారి తాతయ్య వరసిద్ధి చిన్నప్పటి స్నేహితులంట. అప్పట్లో మా తాతయ్యకి ఇంత ఆస్తి లేదు. ఆస్తి సంగతి పక్కన పెడితే అసలు జరుగుబాటే సరిగ్గా ఉండేది కాదంట. మరో వైపు వరసిద్ధిగారిది కలిగిన కుటుంబం. మా తాతయ్యకి చదువు బాగా వచ్చేదంట. అదే వరసిద్ధికి అంత బాగా చదువు వచ్చేది కాదంట. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ చదువుకున్నారంట. చదువయ్యాక కూడా వరసిద్ధిగారే మా తాత వ్యాపారం పెట్టుకోవటానికి అప్పు ఇచ్చాడంట. ఆ పెట్టుబడితో తరువాత మా తాత ఇంత సంపాదించాడు. ఆ సింపతీతో ఇప్పుడు ఆ మురారికీ నాకూ ముడి పెట్టి తన రుణం తీర్చుకోవాలని మా తాతయ్య కోరిక."



"పెద్ద కథ అంటే ఇంకేంటో అనుకున్నాను. మామూలు కథే!..."

"ఇంకో పాయింటు కూడా ఉంది. నాకు కాబోయే మొగుడు తాగుబోతు కాకూడదన్నది మా తాత కోరిక."

"తాగుబోతు కాకూడదన్నంతవరకూ ఓ.కే. కానీ, అదొక్కటే క్వాలిఫికేషన్ అంటే కష్టమే!"

"పైగా ఆ మురారికి తిండి పిచ్చి. తిండి పిచ్చే కదా, అని తేలిగ్గా తీసేస్తారు, కానీ అదెంత టార్చరో అనుభవిస్తే కానీ, నీకు అర్థం కాదు."

"మురారి వాళ్ల ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది?"

"నాట్ బాడ్. పరవాలేదు."

"పోనీ అతన్నే ఇష్ట పడరాదూ? అతనిలో ఏం తక్కువ?"

"ఒకొక మనిషిని చూస్తే ఒకొక ఫీలింగ్ కలుగుతుంది. నాకు మురారిని చూస్తే చికాకు తప్ప మరేం కలగదు."

"అతను మరీ అంత పనికిరాని వాడు కాదేమో... మరోసారి ఆలోచించు."

"ఆ ఫీలింగ్ అలవోకగా కలగాలి. అంతే తప్ప ఆలోచించి చేసుకునేది కాదు పెళ్లంటే!... నా సంగతి వదిలెయ్! నీ ప్రేమ ఎంతవరకూ వచ్చింది. నీ బాయ్‌ఫ్రెండ్ ఏం చేస్తున్నాడు?"

"పెళ్లి చేసుకుని కాపురం చేసుకుంటున్నాడు."

"అదేంటి?" ఆశ్చర్యంగా అడిగింది. "నేను లండన్ వెళ్లక ముందు మీ ఇదరి మధ్యా కెమిస్ట్రీ చూసి, నేను వచ్చేటప్పటికి అతనితో నీ పెళ్లవుతుందనుకున్నానే?"

"ఇద్దరికి పెళ్లవటానికి వర్కవుట్ కావలసింది వారి మధ్య కెమిస్ట్రీ కాదు, ఎకనమిక్స్. ఆ సంగతి అనుభవం మీద కానీ నాకు తెలియలేదు..."

"ఇడియట్! వాడు అలాంటి వాడనుకోలేదే?"

"ఎవడు ఎలాంటివాడో పెళ్లయ్యాక కానీ తెలియదు. ఇంకానయం వీడి సంగతి పెళ్లికి ముందే తెలిసింది..."

"అయామ్ సారీ!..."



"నువ్వెందుకు సారీ చెప్పటం? దటీజ్ మై ఫేట్. నేను జోడీ అనుకున్న వాడు నన్ను కాదని పోయాడు. ఇప్పుడు నాకు జోడీ వెదికే వాళ్లెవరున్నారు?"

"మీ అమ్మా, నాన్నా?..."

"వాళ్లు నేను నెలనెలా పంపే డబ్బుల మీద బ్రతుకీడుస్తున్నారు. వాళ్లు సంబంధం వెతికి నాకు పెళ్లి చెయ్యటం అన్నది కలలో మాట. వాళ్లు ఎవడో ఒకడిని వెదికి తెచ్చినా అమ్మాయి ఫిగర్ చూసి చేసుకునే వాళ్ళు ఎవరూ లేరిక్కడ. మిగిలిన ఫిగర్లకే వాల్యూ."

"ఏంటో!... నాకు వెంటబడుతున్న వాడిని వదిలించుకోవటం ప్రాబ్లం. నీకు వెంటబడే వాడిని వెతుక్కోవటం ప్రాబ్లం." అంది ఈషిక.

ఇద్దరూ మరికాసేపు పనికిరాని మాటలు మాట్లాడుకున్నారు. ఇంతలో తలుపు తట్టి రామలింగం లోపలకు వచ్చాడు. అతని చేతిలోని ట్రేలో టీలు ఉన్నాయి. చెరొక కప్పూ ఇచ్చాడు.

"నేను చెప్పలేదుగా రామలింగం?" అడిగింది ఈషిక.

"మురారి గారు వచ్చారమ్మా! టీ పెట్టమన్నారు. ఎలానూ పెట్టాను కదా అని మీకు కూడా తెచ్చానమ్మా!..."

"మురారి వచ్చాడా? ఎక్కడ ఉన్నాడు?"

"మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకూడదని కింద కూర్చున్నారమ్మా..."

"పద మృదులా!... కిందకి వెళ్దాం... ఆ స్పెసిమన్ ఎలా ఉంటాడో చూద్దువుగాని..." అంది ఈషిక.

ఇద్దరూ కిందకి దిగి వచ్చారు. వాళ్ల వెనుకే రామలింగం కూడా వచ్చాడు.

వీళ్లనుకున్నట్లు మురారి ఖాళీగా కూర్చుని ఈషిక కోసం ఎదురు చూడటం లేదు. డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని రామలింగం చేసిన రకరకాల పదార్థాలు అవగొడుతున్నాడు. వీళ్లు కిందకి రావటం కూడా అతను గమనించలేదు.



"మురారీ! ఎప్పటి నుండి తింటున్నావ్?" అడిగింది ఈషిక.

నోట్లోది మింగటం అయ్యాక, "వచ్చినప్పటి నుంచీ..." అన్నాడు మురారి.

"లేచావేం? మిగిలినవి కూడా కానియ్..."

"ఇంకేం మిగలలేదు..."

ఏదో అనబోయిన ఈషిక రామలింగం కల్పించుకోవటంతో ఆగి పోయింది. "అమ్మా!... వంటవాడికి పెద్ద శిక్ష ఏంటో తెలుసా? తను చేసిన పదార్థాలు తానే పారెయ్యవలసి రావటం. ఈ మురారి బాబుగారు మనింటికి రావటం మొదలెట్టాక నాకా శిక్ష తప్పిందమ్మా!..." అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"పాలక్ పనీర్ కూడా ఖర్చయిందా?" ఆశ్చర్యంగా అడిగింది ఈషిక.

"స్ప్రాన్ కూర కూడా మిగలకుండా..." తృప్తిగా చెప్పాడు రామలింగం.

చేతులు కడుక్కొచ్చిన మురారి, "ఏదో నీ అభిమానం రామలింగం... ఇందులో అంత కష్టం ఏముంది?" అన్నాడు.

"ఈమె మృదుల. నా ఫ్రెండు..." పరిచయం చేసింది ఈషిక.

అప్పుడే ఆమెని గమనించినట్లు చూశాడు మురారి.

"హలో!..." అంది మృదుల.

"హాయ్..." అన్నాడు మురారి. ఇద్దరూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

"మేం చదువుకునే రోజుల్లో మృదుల కాలేజ్ బ్యూటీ..." చెప్పింది ఈషిక.

మురారికి ఎక్కడో చదివిన ఒక జోక్ గుర్తుకు వచ్చింది. చెప్పసాగాడు. "ఈ మధ్య కళ్లు సరిగ్గా కనిపించటం లేదని అనుమానం వచ్చింది. షార్ట్ సైటో, లాంగ్ సైటో అనుకుని కళ్ల డాక్టర్ దగ్గరకు వెళ్లాను. అన్ని పరీక్షలూ చేసి కళ్లకేమీ ఇబ్బంది లేదని చెప్పాడు. మరి ఎందుకు డాక్టర్ నా కళ్లకు ఈషిక తప్ప ఎవరూ అందంగా కనిపించటం లేదని అడిగాను. అది షార్ట్ సైటూ, లాంగ్ సైటూ కాదు...



లవ్ సైటని చెప్పాడు. అందుకే నువ్వు తప్ప నాకు ఎవరూ అందంగా కనిపించరు...” ఈషికతో చెప్పాడు.

“దానిని లవ్ సైటనరు, పార్షియల్ బ్లైండ్‌నెస్ అంటారు...” కచ్చిగా చెప్పింది ఈషిక.

పెద్దగా నవ్వింది మృదుల.

అస్సలు పట్టించుకోలేదు మురారి.

ఇంతలో వాకిట్లో కలకలం వినిపించింది. వినాయకరావు ముందూ, వెనుక హరిదాసూ నడుచుకుంటూ వస్తున్నారు. వినాయకరావు ఆపకుండా హరిదాసుని ఏదో తిడుతూనే ఉన్నాడు.

“ఎక్కడెక్కడో ఉండవలసిన అడ్డ గాడిదలన్నీ గుంపులు గుంపులుగా నా ఇంట్లోనే తిష్ట వేసినయ్. ఒక్కొక్కడూ తింటానికి తిమ్మరాజు పనికి పోతురాజూ...”

“ఏమయ్యింది తాతయ్యా?”

“నడి రోడ్డు మీద కారు ఆగి పోయిందమ్మా...”

“దానికి హరిదాసేం చేస్తాడు?”

“ఆగిపోయింది ఏ రిపేరు వచ్చో అయితే నేను ఇంత హర్టయ్యే వాడిని కాదమ్మా! పెట్రోల్ లేక ఆగి పోయింది. నా పరువంతా పోయింది.”

“అదేంటి హరిదాసూ... డ్రైవర్ అయ్యుండి పెట్రోల్ ఉందో లేదో కూడా చూసుకోవా?”

“ఎందుకు చూసుకోనమ్మా! వెళ్లేటప్పుడు పెట్రోలు బానే ఉంది. అయ్యగారు సిటీ సెంట్రల్లో ఆగి నేను ఇప్పుడే వస్తాను, కదిలావంటే కాళ్లు ఇరగ్గొడతాను... అన్నారమ్మా! అయ్యగారు అటెళ్లగానే ట్రాఫిక్ పోలీస్ వచ్చాడమ్మా! ఇక్కడ ఆపకూడదు, వెళ్లిపోవాలన్నాడమ్మా! అందుకని అక్కడ ఉన్న ట్రాఫిక్ ఐలాండ్ చుట్టూ రౌండ్లు కొడుతూ ఉండిపోయానమ్మా. దానితో పెట్రోల్ తగ్గి పోయింది. అయ్యగారు ఎక్కాక కారు ఆగి పోయింది.”

“నిష్ట దరిద్రుడా! జరిగిందిదని ఒక ఫోన్ చేస్తే సరిపోయేది కదరా!...”

“తట్టలేదయ్యా...”

"నీకు ఏదీ తట్టదు. నీలాంటి వాడిని పనిలో పెట్టుకున్నందుకు నన్ను నేను తట్టుకోవాలి..." అని రామలింగం వైపు తిరిగి, "తెల్లవారుజామున హడావుడిగా ఏమీ తినకుండా బయటకు వెళ్లాను. బ్రేక్‌ఫాస్ట్ పెట్టు..." అన్నాడు.



అయోమయంగా చూశాడు రామలింగం.

"ఏంట్రా అట్లా చూస్తావ్? పెట్టూ..."

"అయ్యా! బ్రేక్‌ఫాస్ట్ అయిపోయిందయ్యా..."

వినాయకరావు కోపంగా ఏదో అనబోయి అక్కడ మురారి ఉండటం గమనించి ఏం జరిగి ఉంటుందో ఊహించుకుని ఎవరినీ ఏమీ అనలేక తనను తాను తిట్టుకుంటూ లోపలకు వెళ్లి పోయాడు.

మురారికి వాతావరణం అనుకూలంగా లేదని అర్థమయింది. "నేను కూడా వెళ్లి వస్తాను. సాయంత్రం వస్తాను. బయటకు వెళ్దామా?" అని అడిగాడు ఈషికని.

"కనపడటంలా... మృదుల వచ్చింది. ఇవాళంతా ఆమెతోనే గడపాలి..."

నిరశగా చూశాడు మురారి. "సరే! ఎంజాయ్ చెయ్యండి. మళ్లీ వస్తాను..." నీరసంగా బయలుదేరాడు.

"మళ్లీ అంటే ఎప్పుడు?" అడిగింది ఈషిక.

"రెండు మూడు గంటల్లో వస్తాను. అప్పటికల్లా మీ మాటలు అయిపోతాయిగా! అప్పుడు ప్లాన్ చేసుకుందాం మన ఔటింగ్ గురించి..." అంటూ వెళ్లి పోయాడతను.

తల పట్టుకుని కూర్చుండి పోయింది ఈషిక.

"ఛీర్ అప్ గాళ్... ఎందుకంత డిప్రెస్ అవుతావు. హి ఈజ్ నాట్ బాడ్. అతని చూపుల్లో ఆరాధన చూశావా? నిన్ను నిజంగా లైక్ చేస్తున్నాడతను..." అంది మృదుల.

"అతన్ని నువ్వయితే చేసుకుంటావా?" అనియంత్రితంగా అడిగింది ఈషిక.

"అతని ఇష్ట పడుతోంది నిన్ను. అదే నన్ను ఇష్టపడి ఉన్నట్లయితే కళ్లు మూసుకుని చేసుకుంటాను."

"అతని తిండి పిచ్చి చూశాక కూడా ఆ మాట అంటున్నావా?"

"రకరకాల మనుషులు, రకరకాల పిచ్చులు. ఏ పిచ్చీ లేనిది ఎవరికి?"



“అతను నిన్ను ఇష్ట పడితే?”

“నిజంగా అదే జరిగితే, అది నా అదృష్టం అనుకుంటాను.”

“అయితే ఇక ఆ సంగతి నాకు వదిలెయ్. అతను నీ చుట్టూ తిరిగేటట్లు చేస్తాను.”

“ఎలా?”

“అది నీకనవసరం. నాకు వదిలెయ్...” అంది ఈషిక. అప్పటికే ఆమె మనసులో ఒక ఆలోచన గూడు కట్టుకుంటోంది.

(((((())))))

**ఇంకా ఉంది...**